# ★ సార్ధకం చేసావు ★

* ఓరుగంటి భైరవశాస్త్రి *

[ఓవల్టిన్, పంచదార వీట్లకి ఒకవిధమైన పట్టణాల్లో ఎంత కరువో చెప్పనలవికాదు. కన్నుపొడుచుకున్నా కాంతిలో కనిపించవు కాని చీకటి బజార్లో కనిపిస్తాయి. కంట్రోలు, రేషనింగు పెట్టడంకూడా వర్తకులకు లక్ష్మీప్రసన్నం ఏమంత కొరతగాలేదు. అధికంగానే వుంది. అవసరాన్నిబట్టి ప్రజ అధికంగా ధరలను ఇచ్చుకోవడానికి రేషనింగు కంట్రోళ్లు అలవాటు చేసాయి. ఆ శాఖల్లో ఉన్న గుమాస్తాలు సైతం ఎంతటి అన్యాయానికి పాల్పడతారో ఈ కథకుడు చూచాయగా తెలియజేసాడు. —సం॥

"కట్టుకోడానికి గుడ్డముక్క లేదు. పోని కార్డుమీద నిన్నవచ్చిన కోటాలో రెండుగజాలు ఇప్పిస్తారా?"

"లేదు. నిన్నకోటా యింకా వుందా? మళ్లా వచ్చినప్పుడిస్తా."

"తప్పదు, మీచిత్తమొచ్చిన ధరకి యేదో గుడ్డ యిద్దురూ?"

"అబ్బ! చంపుతావ్...ఉండు చూస్తా."

* * *

"కుఱ్ఱాడు జ్వరంపడ్డాడు. చాలా నిస్సత్తువుగా వుంది. ఒక డబ్బా...ఓవల్టిన్ దయచేసి..."

"లేదు స్టాక్ ఉంచుకు కూర్చున్నామనుకున్నావా? డ్రగ్ కంట్రోల్ అని తెలీదూ?"

"మీదయ. పోనీ ఇది తీసికోండి. ఎప్పుడు వీలైతే అప్పుడే."

"వీల్లేదోయి. చెపుతే తెలీదు. చూస్తాలే. సాయంకాలం రా."

* * *

"జ్వరంతో చస్తున్నా. బెల్లంకాఫీ త్రాగితే కడుపులో త్రిప్పుతోంది. ఇంత పంచదార వేసి..."

"లేదు పైన బోర్డు చూడలేదూ?"

"అదిగో అలాఅంటే ఎలా? మీరన్నదానికి కాదంటేగా!"

"ఒరు స్పెషల్ కుడప్పా"

* * *

ఇదే తంతు ఎచ్చటకు వెళ్ళినా. ముందు "లేదు" అమాటే అది వున్నాసరే లేకపోయినా సరే! తరువాత సమయాసమయాలనుబట్టి ఏమో!

మా దురదృష్టమేమోకాని గుమ్మంలో కాలు పెట్టి నోరువిప్పేసరికి "లేదు" అంటూ చెవులు గింగురులెత్తేటట్టు అరుస్తాడా రేషను గుమస్తా.

"అందుకనే అంతా "లేదేశ్వరరావు" అనే పిలవటం మొదలెట్టేరు. అందరూ అదేనామంతో పిలుస్తూంటే పొంగిపోయేవాడా గుమస్తా. తన అరువది దినముల ఏకఛత్రాధిపత్యంలో లేదు శబ్దంతో విసిగి యేడ్చినవారూ వున్నారు లేచి తంతామన్నవారూ వున్నారు. ఇంతకీ ఊరంతకీ అదే షాపు.

బాబుగారు షాపులో వెలిగించే రాజ్యాంగ విశేషాలన్నీ పెద్దలకు తెలిసి బయలుదేరి వచ్చారు. తణిఖీజరిగింది. వస్తువులలో తరుగు. డబ్బులో తరుగు.

ఎవ్వరికీ ఏజన్మలోనూ యిచ్చే పద్ధతిలేని యీ మహాశయునికి యింత తరుగెలావచ్చిందా అనుకున్నారు ప్రజంతా.

ఊర్లోవారికి లేదు గాని స్వంతానికి లేదు గదా? ఈతరుగులు యెలాపూడ్చటం. ఇల్లుతగలెట్టవచ్చునుగాని కట్టడం కష్టంగాదూ?

ముల్లు ఆకుకు తగిలినా ఆకుకే ప్రమాదం. ఆకు ముల్లుకు తగిలినా ఆకుకే ప్రమాదం. ప్రజల మీదే పడ్డాడు కథానాయకుడు. "నీకూ బెబ్బే నీ బాబుకీ బెబ్బే" అనేవారికి యెవరు సాయంచేస్తారు చెప్పండి.

కార్యసాధకుడు ఉచ్చం నీచం చూడడు కాదూ? అందరికాళ్ల వేళ్ళాపడ్డాడు. ఎంతఅయిన తక్కినజాతులవలె పాషాణహృదయులు కారుగా భారతీయులు. ఆలోచించారు. హృదయాలు కరగాయి కొందరు దయార్ద్రహృదయాలకు.

"చిన్నవాడు తెలీదు!" అన్నారు కొంత మంది.

"ఎంత చెడ్డవాడైనా కష్టం వచ్చినప్పుడు గట్టెక్కించి తరువాత తగినట్టు చేయడం మంచిదన్నారు." దూరంఆలోచించిన కొందరు.

"ఈ సమయంలో సాయంచేస్తే ముందరికైనా ఏమైనా లాభం వుంటుందనుకున్నారు" ముందరి కాళ్ళకు బంధంవేసే కొందరు మహానుభావులు.

ఎలాగైతేనేం నిర్ణీతకాలంలో తీర్చే షరతులపై సహాయంచేసారు.

కొంతకాలం గడిచింది.

సహాయదారులకు డబ్బు అవుసరం వచ్చింది. కబురంపేరు లేదేశ్వరరావు గారికి.

"మా డబ్బుసంగతి ఏమిటి? చాలా అవుసరంగా వుంది." అంటూ అడిగేరు.

తణుకు బెణుకు లేకుండా "లేదు" అన్నాడు పాపం! ఒకరికీ నోటంట మాటరాలేదు.

"లేదు, ఎలాగ?" అంటూ దీర్ఘంగా ఆలోచిస్తున్నారు లేదేశ్వరరావుగారు దించినబుర్ర యెత్తకుండా.

"పేరు సార్థకంచేసేవోయి" అన్నాడో పెద్ద వచ్చీరాని నవ్వుతెచ్చుకుంటూ.

ఉదయం ఆయాసం

దేహములోని శక్తి అధికముగా వ్యయమౌటవల్లనే నిస్పత్తువ యేర్పడుతుంది. అధికముగా వ్యయమయ్యే యీ జీవశక్తిని తిరుగా సమకూర్చుకొనుటకు సకాలములో శ్రద్ధవహింపకపోతే, మీ దేహము దారుణమైన బలహీనతకు యెరయౌతుంది. కనుక వెంటనే జీవామృతముద్వారాఅధికశక్తిని సమకూర్చుకోవలెను. జీవామృతములోని ప్రతియొక్క బిందువు పుష్టిదాయకమైనది; చైతన్యదాయకమైనది. అంతేగాక ఆరోగ్య బలములను ప్రసాదించును. ఏబది సంవత్సరములుగ ప్రసిద్ధిగన్న భారతీయ టానిక్కు జీవామృతము అని సర్వదా జ్ఞాపకముంచుకొనుడు.



ఇంతటి దారుణమైన నీరసాన్నికూడా నిర్మూలించగల ఉత్తమ రసాయనం.

జీవామృతము

(అన్ని మందుల షాపులలోను దొరకును)
ఆయుర్వేదాశ్రమము లిమిటెడ్,
79, గోపతి నారాయణచెట్టి రోడ్,
త్యాగరాయనగర్, మదరాసు